ఉత్సాహం.. కారాదు విషాదం

నిమజ్జనాల్లో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నియోజకవర్గంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం నాటికి ఉత్సవాలు ప్రారంభమై మూడు రోజులకు చేరుకుంటాయి. ఇప్పటికే నగరంలోని కొన్ని పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులను ఆయా ఉత్సవ కమిటీల ప్రతినిధులు నిమజ్జనం చేశారు. కాగా నిమజ్జనాల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో పలు ప్రమాదాలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నిమజ్జనాల్లో ప్రాణ నష్టం సంభవించకుండా ఉండాలంటే అప్రమత్తత ఒకటే నివారణ అని అధికారులు చెబుతున్నారు. ఎంతో ఆనందంతో ఉత్సాహంగా నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా కొన్ని జాగ్రత్తలను తప్పక పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆధ్యాత్మికతకు అద్దం

నియోజకవర్గంలో వీధి వీధినా కొలువైన గణనాథులతో ఎటు చూసినా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. వినాయక చవితి నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం కొలువుదీర్చిన ప్రతిమలను ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ఘనంగా పూజలు నిర్వహించి ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఆధ్యాత్మికతను పంచుతున్నారు. ఉత్సవాల ముగింపు ప్రక్రియ శుక్రవారం నుంచే ప్రారంభం కానుంది. ఉత్సవాలు ప్రారంభించిన అనంతరం మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో రోజు నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో మూడో రోజు శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో గణనాథులను వేడుకగా నిమజ్జనానికి తరలించడానికి ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

300కు పైగా మండపాలు

గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏలూరు నగరంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో 300కు పైగా మంటపాల్లో గణనాథులను కొలువుదీర్చారు. అత్యధికంగా ఏలూరు నగరంలోనే ప్రతీ వీధిలో పోటాపోటీగా దాదాపు 200 గణపతి మండపాలను ఏర్పాటు చేశారు. కాగా చిన్న పరిమాణంలో ఉన్న ప్రతిమలు వందల్లోనే ఉన్నాయి. ఇళ్లలో ఏర్పాటు చేసిన గణపతులను చాలామంది బుధవారం సాయంత్రమే నిమజ్జనం చేశారు. నగరంలోని తూర్పు లాకులు, పడమర లాకులు, వసంతమహల్ సెంటర్, ఎన్‌టీఆర్ కాలనీ, రామకృష్ణాపురం, పాత బస్టాండు, ఆశ్రం కళాశాల ప్రాంతాల్లో కృష్ణా, గోదావరి కాలువల్లో నిమజ్జనానికి అనుకూలంగా రేవులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే కృష్ణా కాలువ ప్రవహించే కొన్ని ప్రాంతాల్లో కూడా నిమజ్జనాలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో లోతు ఎక్కువగా ఉండడంతో అధికారులు ఆ ప్రాంతాల్లో నిమజ్జనాలు చేయవద్దని హెచ్చరిస్తున్నారు.



గణపతి నిమజ్జనం (ఫైల్)

శాంతియుతంగా నిమజ్జనాలు చేయాలి



గణపతి మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే నిర్వాహకులకు పలు సూచనలు చేశాం. నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా నిర్వహించాలి. వివాదాస్పద గీతాలు, అసహజమైన చర్యలు నిరోధించాలి. ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఊరేగింపునకు ప్రత్యేక మార్గాలు ఉపయోగించి వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగకుండా చూడాలి. నిమజ్జన కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలి. ఊరేగింపు, లేదా నిమజ్జన కార్యక్రమాల్లో మద్యపానం, మత్తు పదార్థాలతో పాల్గొంటే కమిటీ ప్రతినిధులే బాధ్యత వహించాలి.

– డి.శ్రావణ్ కుమార్, ఏలూరు డీఎస్పీ

అప్రమత్తత అవసరం

- మండపాలకు సమీపంలో విద్యుత్ తీగలు ఉంటే అనుకోకుండా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.
- ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండపాల్లో విద్యుత్ ప్రమాదాలకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలి.
- ఎత్తయిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయంలో డీజే బాక్సులు, వాహనాలపై ఎక్కి నిల్చోవడం పరిపాటిగా జరుగుతోంది. ఇలాంటి సందర్భాల్లో మార్గం మధ్యలో వేలాడే విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంటుంది.
- రహదారుల్లో వ్యతిరేక మార్గంలో ఊరేగించడం, ఎక్కువ మంది రోడ్డు మధ్యలో నడిస్తే వాహన ప్రమాదాలకు గురి కావచ్చు.
- గణేష్ విగ్రహాల ఏర్పాటు ఒక ఎత్తయితే వాటిని ఉంచే మండపాల నిబంధనలను నిరంతరం నిర్వాహకులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఏ చిన్న ప్రమాదం జరిగినా అది ఏ పరిణామాలకు దారితీస్తోందో చెప్పలేం కాబట్టి నిమజ్జనం వరకూ విగ్రహాల వద్ద వంతుల వారీగా నిర్వాహకులు పర్యవేక్షిస్తూ ఉండాలి.
- మద్యం మత్తులో వేడుకల్లో పాల్గొనడం, నిమజ్జన సమయంలో నీటిలోకి దిగి ప్రాణాలపైకి తెచ్చుకోవడం సరికాదని అధికారులు అంటున్నారు. ఉత్సవాలు ముగిసే వరకూ మద్యం జోలికి వెళ్లకుండా ఉండడమే ఉత్తమమని పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలపై ఐకమత్యంగా పోరాడాలి



ఉపాధ్యాయ సంఘాల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో అందరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పాటు పాఠశాల సిబ్బందికి ఎదురయ్యే ఎలాంటి సమస్యపైనైనా అన్ని సంఘాలూ కలిసి ఐకమత్యంగా పోరాడాలని ఏలూరు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వడ్లపట్ల మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల ఆత్మీయ కలయికను నగరంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికీ ఒత్తిడి లేని ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రసాదాలయ నిర్మాణానికి విరాళం అందజేత



వీరభద్ర రావుకు సాయిబాబా ఫొటో అందిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఆదివారపుపేటలోని శ్రీ షిరిడి సాయి ప్రేమ మందిర్‌లో చేపట్టిన శ్రీ సాయి ప్రసాదాలయం నిర్మాణం నిమిత్తం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు జిల్లా వీరభద్రరావు రూ. 1,01,116ను ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మందిరం ప్రధాన అర్చకులు గంగాధర్ వేదమంత్రాలతో ఆయనను ఆశీర్వదించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఇసుకపల్లి తాతారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొల్లేరు గ్రామాల్లో తహసీల్దార్ పర్యటన

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం కొల్లేరులో తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు గురు వారం పర్యటించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొల్లేరు గ్రామాల్లో వర్షపు నీరు ఉధృతి రాకపోకలు, మౌలిక వసతుల కల్పన, ప్రయాణ సౌకర్యాలు వైద్య పరమైన ఇబ్బందులు రవాణాపై పరిశీలించాల్సిందిగా ఇచ్చిన ఆదేశాల మేరకు కొల్లేరు గ్రామాల్లో పర్యటన చేశామని తహసీల్దార్ అన్నారు. అన్ని గ్రామాల పర్యటనపై నివేదికను జిల్లా కలెక్టర్ ఏలూరు ఆర్‌డీఓకు అందజేస్తామని పేర్కొన్నారు. పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్న గ్రామాల్లో సచివాలయ పోలీస్ వైద్య శాఖల ఉద్యోగులను షిఫ్టులు వారీగా డ్యూటీలు వేశామన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద పోస్టర్లు విడుదల చేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి కాలయాపన చేస్తున్నందున డిమాండ్ల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉద్యోగులంతా జయప్రదం చేయాలని ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగ దుర్గారావు పిలుపునిచ్చారు. గురువారం ఏలూరులోని కలెక్టరేట్‌లో వివిధ భాగాల్లోనూ, ఆర్డీఓ ఆఫీస్, సర్వే ఆఫీస్, సహకార శాఖ,ట్రెజరీ, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఆఫీస్‌లలో చలో విజయవాడ కార్యక్రమం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తయినా సీపీఎస్ మీద ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలు ఇవ్వలేదన్నారు. ఉద్యోగులకు ఒక్క డీఏ కూడా విడుదల చేయలేదని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ఇస్తామని అది కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తూ గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎం.రాంబాబు, కామవరపుకోట మండల నాయకుడు ఈదుబిల్లి వెంకటేష్, ట్రెజరీ ఉద్యోగుల సంఘం నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలయోగి సైన్స్ పార్క్‌కు రూ.15 లక్షలు మంజూరు




బాలయోగి సైన్స్‌పార్కును సందర్శిస్తున్న ఎస్ఎస్‌ఏ రాష్ట్ర అదనపు డైరెక్టర్ నాగేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని బాలయోగి సైన్స్ పార్క్‌కు రూ. 15 లక్షల నిధులు విడుదల చేయనున్నట్టు రాష్ట్ర సమగ్ర శిక్షా అడిషనల్ డైరెక్టర్, స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కే. నాగేశ్వరరావు తెలిపారు. గురువారం బాలయోగి సైన్స్ పార్క్‌ను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, రూ.40 లక్షలతో పార్క్ ఆధునికీకరణ చేశారని, ఇంకా అత్యాధునిక సైన్స్ పరికరాల కొనుగోలు కోసం మరో రూ. 15 లక్షలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల కోసం 15 రోజుల్లో ప్రత్యేక షెడ్యూల్ రూపొందించి, ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పార్క్‌ను సందర్శించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అగస్త్య ఫౌండేషన్ సహకారంతో కొత్త పరికరాలు కూడా పార్క్‌లో ఉంచుతారని, వీటితో విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేసి సులభరీతిలో సైన్స్ పాఠాలను అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. విద్యార్థులకు నిరంతరం ప్రయోజనం చేకూరేలా, ఒక అనుభవజ్ఞుడైన సైన్స్ ఉపాధ్యాయుడు పార్క్‌లో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రెడ్డి రామారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సంతోష్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని సుబ్బమ్మదేవి స్కూల్, పాముల దిబ్బ, చింతచెట్టురోడ్డు, చేపలతూము సెంటర్, గాంధీనగర్, వాసా వారి వీధి, శేఖర్ వీధి ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే వెంకన్న చెరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో అరుంధతి పేట, పడమర వీధి, తొంగల మండపం రోడ్డు, పాలతూము సెంటర్, శనగపప్పు బజారు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టణంలో వినాయక చవితి సందడి



మెయిన్ బజారు ఫిష్ మార్కెట్‌లో భారీ వినాయకుడు



పవరుపేట స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన గణేశుడు



ఎన్ఆర్‌పేటలో ఏర్పాటు చేసిన వినాయకుడు



రామకోటిలో ఏర్పాటు చేసిన భారీ లంబోదరుడు

- వాడవాడలా గణపతి ప్రతిమల ఏర్పాటు
- కొనసాగుతున్న ప్రత్యేక పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉత్సవాలను ప్రారంభించి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించడానికి ఉత్సవ కమిటీల ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నా నగరంలో వాడవాడలా ఏర్పాటు చేసిన పందిళ్లలో ఉత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో భారీ వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, దీక్ష ధారణ, అంకురార్పణ, కలశ స్థాపన, వరసిద్ధి వినాయక వ్రత కల్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.



తంగెళ్ళమూడిలో ఏనుగులపై ఆశీనులైన వినాయకుడు



చేపలతూము సెంటరులో..



పడమరవీధి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద..

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	38	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	34	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	36	కంద	00
కాకర కాయలు	24-30	బీట్‌రూట్	36
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40-48	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	36	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	20-28	పుదీనా	05
ఆనపకాయ (1)	20-30	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	46

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	37
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	26
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	33
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

దేశాభివృద్ధిలో యువత ప్రాధాన్యత పెరగాలి



మాట్లాడుతున్న సుంకర రాము

ఏలూరు రూరల్: దేశ అభివృద్ధి, ఆకాంక్షలను యువత ఆకళింపు చేసుకోవాలని సెట్‌వెల్ సీఈఓ అధికారి ప్రభాకర్ అన్నారు. గురువారం ఏలూరు సీఆర్ఆర్ కళాశాల ఆవరణలో కేంద్ర యువజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేరా యువ భారత్ అధికారి సుంకర రాము మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిస్థితులపై యువత అవగాహన పెంచుకుని తదనుగుణంగా వ్యవహరించాలన్నారు. సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జితేంద్ర, జిల్లా ఉపాధి అధికారి వి.వరలక్ష్మీ పాల్గొన్నారు.

యూరియా రైతులకు మాత్రమే ఇవ్వాలి

ఉంగుటూరు: యూరియా రైతులకు మాత్రమే ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. గురువారం ఉంగుటూరులో గ్రోమార్ ఎరువుల దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయేతర అవసరాలకు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. అమ్మకాలు ప్రతి రోజూ ఈపాస్‌లో నమోదు చేసి మాత్రమే రైతులకు అమ్మాలని సూచించారు. యూరియా సరఫరా నిల్వ, అమ్మకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

రాకపోకలకు ఇబ్బందులు

ఏలూరు (టూటౌన్): డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షాలకు నీరు రోడ్డుపైనే నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం కలిగించింది. డ్రెయినేజీ వ్యవస్థను సరిచేయకుండా తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులిపేసుకోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందని ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు,పాదచారులు విమర్శిస్తున్నారు. ఏలూరు తూర్పు లాకుల నుంచి పోతునూరు వెళ్ళే మార్గంలో ఇటీవల కురిసిన వర్షానికి కొమడవోలు వంతెనకు సమీపంలో వర్షం నీరు పెద్ద ఎత్తున రోడ్డుపై నిలిచి ఉంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మార్గం ఎత్తుగా ఉండటంతో పాటు, మురుగు నీరు పారేందుకు అవసరమైన డ్రెయిన్ లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున వర్షం నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలిగిస్తుంది. నగరానికి దూరంగా విసిరేసినట్టు ఉండే ఈ ప్రాంతంలో డ్రెయినేజీ, రోడ్లు వంటి మౌలిక వసతుల పట్ల నగరపాలక సంస్థ శ్రద్ధ పెట్టక పోవడంతో ఈ ఏరియాలోని సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారంటూ ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు చెబుతున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు మనసు పెట్టి మురుగు నీరు పారే విధంగా డ్రెయినేజీ వ్యవస్థను సరి చేయాలంటూ ఈ ప్రాంత వాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు.



ఏలూరు నుంచి పోతునూరు వెళ్ళే రహదారిలో కొమడవోలు వద్ద ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీటిలో రాకపోకలు చేస్తున్న దృశ్యం

కోమటిలంకకు కన్నీటి కష్టాలు

20 రోజులుగా పడవలోనే ప్రయాణం

దెందులూరు: కోమటిలంకకు కన్నీటి కష్టాలు వీడటం లేదు. సురక్షితమైన రహదారి మార్గం లేకపోవడం వర్షపు నీరు ప్రమాదకర స్థితిలో ప్రవహించడం కోమటిలంక గ్రామస్తులకు శాపంగా మారింది. దీనికి తోడు మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించడంతో గ్రామస్తుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. వృద్ధులు, వికలాంగులు, ఇతర అనారోగ్యంతో వైద్యశాలకు వెళ్లే వారికి నరకప్రాయంగా తయారైంది. వీరు కాకుండా విద్యార్థులు, ఉదోద్యగస్తులు, వ్యాపారులు, కూలీలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఉన్న ఒక రేకుల పడవని నమ్ముకున్నారు. ఆ పడవలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇన్ని కష్టాలు పడుతున్న కోమటి లంక గ్రామం జిల్లా కేంద్రమైన ఏలూరుకు కూత వేటు దూరంలోనే ఉండటం గమనార్హం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.విజయ కుమార్‌రాజు కోమటిలంకను రెండు రోజులకు ఒకసారి వెళ్లి పడవ ప్రమాదం జరగకుండా ఎక్కువ మంది ప్రయాణం చేయకుండా గ్రామంలోనూ, వెలుపల ప్రభుత్వ ఉద్యోగులకు విధులు కేటాయిస్తూ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు.



పడవలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

గణపవరం: స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకులు ఇస్తున్న రుణాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని యుకో బ్యాంకు ఏజీఎం ప్రశాంత్‌కుమార్ అన్నారు. గురువారం గణపవరం మండలం మొయ్యేరులో అత్తిలి యుకోబ్యాంకు ఆధ్వర్యంలో మొయ్యేరులో ఏర్పాటు చేసిన మెగా రుణమేళా సమావేశానికి సర్పంచ్ దుళ్ల కుటుంబరావు అధ్యక్షత వహించారు. మొయ్యేరు, కోమర్రు గ్రామాలకు చెందిన 16 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.3.05 కోట్ల రూపాయల రుణాలు పంపిణీ చేశారు. ఈమేరకు గ్రూపు లీడర్లకు బ్యాంకు చెక్కులు అందచేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కె.ప్రసాద్, మొయ్యేరు సొసైటీ అధ్యక్షుడు కానుమిల్లి వెంకటేశ్వరరావు, యూకో బ్యాంకు మేనేజర్ సుదీప్తమిశ్రా, బీఎం సురేష్, ఏపీఎం అమీరున్నీసా, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.